Truth of News
RNI NO : APTEL/25/A0239
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 156 | ఆదివారం 16 నవంబరు 2025 | పేజీలు : 08 | వెల రూ.6.50

IRS PUBLICATIONS
irspublications12@gmail.com



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్
బి.రామకృష్ణ గవైకి ఘన స్వాగతం

## స్పిన్‌కు విలవిల

- రవీంద్ర జడేజా, కుల్‌దీప్ మాయాజాలం
- దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ 93/7
- భారత్ తొలి ఇన్నింగ్స్ 189/10

పరుగుల పిచ్ అంటూ ఊరించిన ఈడెన్‌గార్డెన్స్.. బ్యాటర్లకు చుక్కలు చూపిస్తోంది. తొలి రోజు పేసర్లు విజృంభించగా.. రెండో రోజు స్పిన్ మాయ మొదలైంది. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 189 పరుగులకు ఆలౌట్ కాగా.. దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 93 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయింది. స్వల్ప స్కోర్ల టెస్టు మూడు రోజుల్లోనే ముగిసే అవకాశం ఉంది.

**కోల్‌కతా, సూర్యవాస్తవం:** లెఫ్టార్మ్ స్పిన్నర్ రవీంద్ర జడేజా (4/29), - మిగతా 2లో..



## ఎన్నికలు న్యాయంగా జరగలేదు

- ఫలితాలపై లోతుగా చర్చిస్తాం
ప్రజాస్వామ్య పరిరక్షణకు మరింత కృషి : రాహుల్

**న్యూఢిల్లీ, సూర్యవాస్తవం:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ స్పందించారు. బీహార్ ఎన్నికలు మొదటి నుంచి కూడా న్యాయంగా జరగలేదనీ, అందుకే విజయం సాధించలేకపోయామని ఆరోపించారు. ఫలితాలు ఆశ్చర్యకరంగా వచ్చాయని పేర్కొన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడుతున్నామని 2లో



# రెండు రోజుల్లో రూ.13 లక్షల కోట్లు

- వచ్చే ఏడాది నవంబర్‌లో మళ్లీ నిర్వహిస్తాం
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- మరిన్ని ప్రతిపాదనలతో రావాలని పిలుపు




- మిగతా 2లో..

## మరో అల్పపీడనం..
## 17,18 తేదీల్లో వర్షాలు



**అమరావతి, సూర్యవాస్తవం:** నైరుతి బంగాళాఖాతం, శ్రీలంక తీరప్రాంతంలో అల్పపీడనం ఏర్పడిందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి ప్రఖర్‌జైన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అల్పపీడనానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందన్నారు. రాగల 24 గంటల్లో పశ్చిమ వాయువ్య దిశగా నెమ్మదిగా కదులుతుందని తెలిపారు. అల్పపీడనం ప్రభావంతో దక్షిణ కోస్తా తీరం వెంబడి గంటకు 35 నుంచి 55 కిలోమీటర్లు వేగంగా ఈదురుగాలులు వీస్తాయన్నారు. సోమవారం వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని ఆయన సూచించారు. ఈనెల 17న నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు, ప్రకాశం, కడప జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. 18న నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ప్రకాశం, శ్రీసత్యసాయి, కడప అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ నెల 21న బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందన్నారు.

## సతీష్‌కుమార్ మృతిపై
# విచారణ వేగవంతం

- ఘటనా స్థలాన్ని పరిశీలించిన సిఐడి అదనపు డిజిపి రవిశంకర్ అయ్యన్నార్
కోమలి రైల్వే స్టేషన్ సమీపంలో పోలీసులు సీన్ రీ కన్‌స్ట్రక్షన్


**అనంతపురం, సూర్యవాస్తవం:** టిటిడి మాజీ ఎవిఎస్ఒ, గుంతకల్లు రైల్వే సిఐ సతీష్‌కుమార్ మృతిపై పోలీసు విచారణ ముమ్మరమైంది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదైన నేపథ్యంలో మరణానికి కారణం ఆత్మహత్యా? లేక హత్యా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. టిటిడి పరకామణి కేసులో కీలక సాక్షిగా, నిందితుడిగా ఉన్న సతీష్‌కుమార్ ఆ కేసు విచారణ నిమిత్తం తిరుపతి వెళ్తుండగా మధ్యలో అనుమానాస్పద స్థితిలో శుక్రవారం రాత్రి మృతి చెందారు. కుటుంబ సభ్యులు ఇది ముమ్మాటికీ హత్యేనని ఆరోపిస్తున్న నేపథ్యంలో ఆ దిశగానూ పోలీసులు విచారణ చేస్తున్నారు. సిఐడి అదనపు డిజి రవిశంకర్ అయ్యన్నార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతపురంలోని పోలీసు అతిథి గృహంలో అనంతపురం రేంజ్ డిఐజి షిమోసి, ఎస్‌పి జగదీశ్‌తో, పోస్టుమార్టం నిర్వహించిన అనంతపురం సర్వజన ఆస్పత్రి ఫోరెన్సిక్ వైద్యులు, మృతదేహంపై ఉన్న గాయాలను పరిశీలించేందుకు సిటి స్కాన్ రేడియాలజీ విభాగానికి చెందిన వైద్యులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సుదీర్ఘంగా వారితో చర్చించారు. గుంతకల్లు రైల్వే స్టేషన్ నుంచి ప్రమాదం జరిగిన ఘటన వరకు జరిగిన రైలు ప్రయాణానికి సంబంధించి ఏమైనా ఆధారాలున్నాయా అనే కోణంలోనూ ఆరా తీసినట్లు సమాచారం.

**ఆ గంటలో ఏమి జరిగింది?**

పరకాణి కేసు విచారణకు - మిగతా 2లో..



# సతీష్‌కుమార్ మృతిపై విచారణ వేగవంతం




(మొదటిపేజీ తరువాయి)
హాజరయ్యేందుకు సతీష్‌కుమార్ శుక్రవారం రాత్రి రాయలసీమ ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. ఎ-1 బోగి బెర్తు నెంబరు 29 ఆయనకు కేటాయించబడింది. రాత్రి 11.53 గంటలకు ఆయన గుంతకల్లు రైల్వే స్టేషన్‌కు మోటర్ బైకుపై వచ్చిన దృశ్యాలు రైల్వేస్టేషన్ సిసి ఫుటేజీలో రికార్డు అయింది. రైలు నిర్ణీత సమయం కంటే అరగంట ఆలస్యంగా వచ్చింది. రాత్రి ఒంటి గంట ప్రాంతంలో ఆ రైలు గుంతకల్లు రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరింది. ఈ నేపథ్యంలో సిఐ సతీష్ తాడిపత్రి మండలం కోమలి రైల్వేస్టేషన్ ప్రాంతంలో విగతజీవిగా పడి ఉన్నారు. కోమలి రైల్వే స్టేషన్‌ను అర్ధరాత్రి 2.04 గంటలకు రైలు దాటి వెళ్లింది. 2.09 గంటలకు తాడిపత్రి రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. సతీష్‌కుమార్ రైలు ఎక్కినప్పటి నుంచి ఆయన మృతదేహం లభించిన ప్రాంతానికి గంట ప్రయాణం జరిగింది. ఈలోపు ఏమి జరిగిందన్నది ఇప్పుడు పోలీసులు ఆరా తీస్తున్నారు. సతీష్‌కుమార్ ప్రయాణించిన ఎ-1 బోగిలో తోటి ప్రయాణికులు ఎవరెవరున్నారన్న దానిపైనా పోలీసులు కూపీ లాగుతున్నారు. వారి ద్వారా సమాచారం కొంత సేకరించేందుకు వీలుంటుందని భావిస్తున్నారు. సాధారణంగా ఎసి బోగిల్లో రైల్వే శాఖ సిసి కెమెరాలను అమర్చింది. రాయలసీమ ఎక్స్‌ప్రెస్ ఎ-1 బోగిలో సిసి కెమెరాలు లేనట్టు తెలుస్తోంది. ఇవి ఉండి ఉంటే సతీష్‌కుమార్ మృతిపై మరింత స్పష్టత వచ్చేదని పోలీసులు భావిస్తున్నారు.

**పోస్టుమార్టంలో ఏముంది?**

సతీష్‌కుమార్ మరణం అనుమానాస్పదం కావడంతో కీలకంగా పోస్టుమార్టం నివేదికపై పోలీసులు దృష్టి సారించారు. పోస్టుమార్టం సమయంలో రాయలసీమ రేంజ్ డిఐజి, అనంతపురం ఎస్‌పి ప్రత్యక్షంగా పరిశీలించారు. శనివారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించిన వైద్యులతో సమావేశమయ్యారు. వెనుకభాగంలో ఎక్కువగా గాయాలవడంతో సతీష్‌కుమార్‌కు మృతి చెందినట్లు తెలుస్తోంది. దీనికి కారణాలను తెలుసుకునేందుకు పోలీసులు మృతదేహం పడి ఉన్న కోమలి రైల్వే స్టేషన్ సమీపంలో సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేశారు. రైలు నుంచి కిందకు పడితే ఏ రకంగా గాయాలయ్యే అవకాశముందని బొమ్మల ద్వారా పరిశీలించారు. రైల్వే ట్రాక్‌పై ప్రమాదం జరగడంతో గుత్తి రైల్వే పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఇందులో అనేక సందేహాలు ఉండడంతో కేసు విచారణను మరింత లోతుగా చేసేందుకు తాడిపత్రి పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు.

## ఎన్నికలు న్యాయంగా జరగలేదు

(మొదటిపేజీ తరువాయి)
ఫలితాలపై కాంగ్రెస్, ఇండియా బ్లాక్ లోతైన సమీక్ష జరుపుతుందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు తాము మరింతగా కృషి చేస్తామని వివరించారు. మహాగట్‌బంధన్ కూటమి పట్ల విశ్వాసం ఉంచిన లక్షలాది మంది బీహార్ ఓటర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

**ప్రజా తీర్పును గౌరవిస్తాం : ఖర్గే**

బీహార్ ప్రజల నిర్ణయాన్ని తాము గౌరవిస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగపరుస్తూ ప్రజాస్వామ్యాన్ని బలహీనపర్చే శక్తుల పట్ల తాము పోరాటాన్ని కొనసాగిస్తామని చెప్పారు. ఎన్నికల ఫలితాలపై సమగ్ర అధ్యయనం జరుపుతామని వివరించారు. కాంగ్రెస్ కార్యకర్తలు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని ఎక్స్‌లో రాసుకొచ్చారు. ప్రజల్లో ఉంటూ.. రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణకు మన పోరాటం కొనసాగుతుందని వివరించారు. తమ పోరాటం నిబద్ధతతో కూడుకొని ఉంటుందని పేర్కొన్నారు.

# రెండు రోజుల్లో .. రూ.13 లక్షల కోట్లు



**విశాఖపట్టణం, సూర్యవాస్తవం:** రెండు రోజుల్లో రాష్ట్రానికి 13 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. విశాఖపట్నంలోని ఎయు ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో శనివారం సాయంత్రం జరిగిన సిఐఐ ముగింపు సదస్సులో ప్రతినిధులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలో జరిగిన రెండు రోజుల సిఐఐ భాగస్వామ్య సదస్సు చరిత్రలో నిలిచిపోతుం దని చెప్పారు. 'ఇక్కడ జరిగినవి ఒప్పందాలు మాత్రమే కాదు.. సాంకేతిక ఆలోచనల మార్పిడి. దావోస్ తరహాలో ఈ సెషన్లు నిర్వహించాం.' అని చెప్పారు. 'విశాఖతో రాష్ట్రంలో ఏ నగరానికీ పోలిక లేదు' అని అన్నారు. వచ్చే ఏడాది నవంబర్‌లో మరలా సిఐఐ సదస్సు ఇక్కడే నిర్వహిస్తామని చెప్పారు. ఆ సదస్సుకు మరిన్ని పెట్టుబడులతో రావాలని కోరారు రాష్ట్రంలో మరింతగా కార్మిక సంస్కరణలు చేపడ తామని, భూములు, మౌలిక వసతుల రంగంలోనూ సంస్కరణలు తెస్తామని అన్నారు. పెట్టుబడులతోనే పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు కలుగుతాయని చెప్పారు. దేశంలో ఎక్కడాలేని రీతిలో ఎస్‌క్రో ఖాతాను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ప్రభుత్వం దీనికి గ్యారంటీ ఇస్తోందన్నారు. రెండు రోజుల పాటు జరిగి ఈ భాగస్వామ్య సదస్సుకు మూడు వేల మంది ప్రతినిధులు హాజరు కాగా, దీంట్లో 650 మంది విదేశీయులు ఉన్నారని చంద్రబాబు చెప్పారు. 700 మంది బి టు బి మీటింగుల్లో పాల్గొన్నారన్నారు. వివిధ దేశాల నుంచి 30 మంది మంత్రులు ఈ భాగస్వామ్య సదస్సుకు విచ్చేశారని, రెండు రోజుల పాటు 67 సెషన్లు జరిగాయన్నారు.

**పారిశ్రామిక వేత్తలు పోటీపడుతున్నారు**

అంతకుముందు జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు పోటీపడుతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం ఉండటమే దీనికి కారణమన్నారు. తన హయాంలో ఏడుసార్లు సిఐఐ సదస్సులు పెట్టానని, ఈ సదస్సు మాత్రం చారిత్రాత్మకంగా నిలిచిపోనుందని చెప్పారు. అయితే, ఎంఒయులు చేసినంత మాత్రాన ప్రాజెక్టులు రావని, పెట్టుబడుల ఆకర్షణ అనేది నిరంతర ప్రక్రియ అని అన్నారు. రెండు రోజుల్లో రూ.13,25,716 కోట్ల పెట్టుబడుల మేర ఎంఒయులు వచ్చాయని, 24 లక్షలకుపైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రాబోతున్నాయని వివరించారు. రాష్ట్రంలో 2019-2024 అత్యంత విషాదకరమైన కాలమన్నారు. పరిశ్రమలను గత ప్రభుత్వం ధ్వంసం చేసిందని విమర్శించారు. ఇతర రాష్ట్రాల మాదిరే ఆంధ్రప్రదేశ్‌కూ కేంద్రం సహకరిస్తోందన్నారు. కడపలో స్టీల్‌ప్లాంట్ వస్తుందని, విశాఖకు లులూ, గూగుల్, అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిట్టల్ ప్లాంట్‌లు వస్తాయని తెలిపారు.

ఈ సమావేశంలో కేంద్ర మంత్రి టిజి.భరత్, రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, గుమ్మడి సంధ్యారాణి, దుర్గేష్, విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**విశాఖ ఉక్కుపై చంద్రబాబు ఘాటు వ్యాఖ్యలు**

విలేకర్ల సమావేశంలో 'విశాఖ ఉక్కులో అనిశ్చితి నెలకొందని, దీన్ని మీ ప్రభుత్వం ఎలా చూస్తోంది' అంటూ అడిగిన ప్రశ్నకు చంద్రబాబు ఘాటైన వ్యాఖ్యలు చేశారు. 'ఇప్పటికే రూ.12 వేల కోట్లు ఇచ్చాం. ప్రతిసారీ కేంద్రం డబ్బులు ఇవ్వాలంటే కుదరదు. అన్ని స్టీల్‌ప్లాంట్‌లకూ లాభాలొస్తుంటే ఇక్కడ ఎందుకు రావడం లేదు' అంటూ అసహనం ప్రదర్శించారు. పబ్లిక్ సెక్టార్‌లో ఉందని బెదిరిస్తామంటే కుదరదని, నష్టాల్లో నడవడానికి వీల్లేదని అన్నారు. 'ప్రైవేటీకరణ చెయ్యనని నేను చెప్పాలా? ప్యాకేజీ ఇచ్చాం కదా!' అని అన్నారు.

# స్పిన్‌కు విలవిల

(మొదటిపేజీ తరువాయి)
చైనామన్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ (2/12) మాయాజాలం సృష్టించారు. మరో స్పిన్నర్ అక్షర్ పటేల్ (1/30) సైతం మాయలో జతకలవటంతో దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 93/7తో కష్టాల్లో పడింది. కెప్టెన్ తెంబ బవుమా (29 నాటౌట్, 78 బంతుల్లో 3 ఫోర్లు), కార్బిన్ బాచ్ (1 నాటౌట్) అజేయంగా ఆడుతున్నారు. అంతకుముందు భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 189 పరుగులే చేసింది. ఓపెనర్ కెఎల్ రాహుల్ (39, 119 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), రిషబ్ పంత్ (27, 24 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), రవీంద్ర జడేజా (27, 45 బంతుల్లో 3 ఫోర్లు) రాణించారు. దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 159 పరుగులకే ఆలౌట్ కాగా.. భారత్ 30 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది.

సఫారీ విలవిల : స్పిన్ త్రయం జడేజా, కుల్‌దీప్, అక్షర్ మాయ ముందు దక్షిణాఫ్రికా బ్యాటర్లు విలవిల్లాడారు. ఓపెనర్ రికెల్టన్ (11) వికెట్‌తో కుల్‌దీప్ వికెట్ల జాతరకు తెరతీయగా.. జడేజా సఫారీ పతనం వేగవంతం చేశడు. మార్‌క్రామ్ (4)ను అవుట్ చేసిన జడేజా.. వియాన్ ముల్డర్ (11), టోనీ (2)లను ఒకే ఓవర్లో సాగనంపాడు. ట్రిస్టన్ స్టబ్స్ (5) సైతం జడేజా మాయలో పడ్డాడు. మార్కో జాన్సెన్ (13)ను కుల్‌దీప్.. కైల్ వెరెనె (9) అక్షర్ అవుట్ చేయటంతో దక్షిణాఫ్రికా 91 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయింది. తొలి ఇన్నింగ్స్ లోటు అనంతరం సఫారీ ప్రస్తుతం 63 పరుగుల ముందంజలో నిలిచింది. కెప్టెన్ తెంబ బవుమా (29 నాటౌట్) ఓ ఎండ్‌లో సమయోచిత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకోగా.. నేడు ఉదయం సెషన్లో ఆ జట్టు 50-60 పరుగులు జోడించటంపై కన్నేసింది.

**మనోళ్లూ పడ్డారు**

ఈడెన్‌గార్డెన్స్ పిచ్‌పై భారత బ్యాటర్లు సైతం తడబాటుకు గురయ్యారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (4) మెడ నొప్పితో రిటైర్డ్ హర్ట్‌గా నిష్క్రమించి, మళ్లీ బ్యాటింగ్‌కు రాలేదు.

ఓపెనర్ కెఎల్ రాహుల్ (39) నాలుగు ఫోర్లు, ఓ సిక్సర్‌తో మెరువగా.. వాషింగ్టన్ సుందర్ (29) నం.3 బ్యాటర్‌గా ఆకట్టుకున్నాడు. రిషబ్ పంత్ (27) రెండు సిక్సర్లు, రెండు ఫోర్లతో ధనాధన్ దూకుడు చూపించగా.. రవీంద్ర జడేజా (27) రాణించాడు. ధ్రువ్ జురెల్ (14), అక్షర్ పటేల్ (16) ఫర్వాలేదనిపించారు. టెయిలెండర్లు కుల్‌దీప్ (1), సిరాజ్ (1), బుమ్రా (1 నాటౌట్) పరుగుల వేటలో మెప్పించలేదు. 62.2 ఓవర్లలో భారత్ 189 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో 30 పరుగుల విలువైన ఆధిక్యం దక్కించుకుంది.

**స్కోరు వివరాలు**

**దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ : 159/10**

భారత్ తొలి ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ (బి) జాన్సెన్ 12, కెఎల్ రాహుల్ (సి) మార్‌క్రామ్ (బి) మహరాజ్ 39, వాషింగ్టన్ సుందర్ (సి) మార్‌క్రామ్ (బి) హార్మర్ 29, శుభ్‌మన్ గిల్ (రిటైర్డ్ హర్ట్) 4, రిషబ్ పంత్ (సి) వెరెనె (బి) బాచ్ 27, రవీంద్ర జడేజా (ఎల్బీ) హార్మర్ 27, ధ్రువ్ జురెల్ (సి,బి) హార్మర్ 4, అక్షర్ పటేల్ (సి) జాన్సెన్ (బి) హార్మర్ 16, కుల్‌దీప్ యాదవ్ (సి) వెరెనె (బి) జాన్సెన్ 1, సిరాజ్ (బి) జాన్సెన్ 1, బుమ్రా నాటౌట్ 1, ఎక్స్‌ట్రాలు : 18, మొత్తం : (62.2 ఓవర్లలో ఆలౌట్) 189.

వికెట్ల పతనం : 1-18, 2-75, 2-79 (గిల్), 3-109, 4-132, 5-153, 6-171, 7-172, 8-187, 9-189.

బౌలింగ్ : మార్కో జాన్సెన్ 15-4-35-3, వియాన్ ముల్డర్ 5-1-15-0, కేశవ్ మహరాజ్ 16-1-66-1, కార్బిన్ బాచ్ 11-4-32-1, సైమన్ హార్మర్ 15.2-4-30-4.

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ : రియాన్ రికెల్టన్ (ఎల్బీ) కుల్‌దీప్ 11, ఎడెన్ మార్‌క్రామ్ (సి) జురెల్ (బి) జడేజా 4, వియాన్ ముల్డర్ (సి) పంత్ (బి) జడేజా 1, తెంబ బవుమా నాటౌట్ 29, టోనీ (సి) జురెల్ (బి) జడేజా 2, ట్రిస్టన్ స్టబ్స్ (బి) జడేజా 5, వెరెనె (బి) అక్షర్ 5, మార్కో జాన్సెన్ (సి) రాహుల్ (బి) కుల్‌దీప 13, కార్బిన్ బాచ్ నాటౌట్ 1,

ఎక్స్‌ట్రాలు : 8, మొత్తం : (35 ఓవర్లలో 7 వికెట్లకు) 93.

వికెట్ల పతనం : 1-19, 2-25, 3-38, 4-40, 5-60, 6-75, 7-91.

బౌలింగ్ : జశ్‌ప్రీత్ బుమ్రా 6-1-14-0, అక్షర్ పటేల్ 11-0-30-1, కుల్‌దీప్ యాదవ్ 5-1-

## సంపాదకీయం

# టాలీవుడ్ లో రివ్యూ మాఫియా

కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి.. కొన్ని నెలల పాటు కష్టపడిన సినిమాకు.. ఎవరో ఎక్కడో కూర్చొని.. దానికి నెగటివ్ లేబుల్ అంటించేసి.. ఇంటర్నెట్, వెబ్ సైట్లు, సోషల్ మీడియా ద్వారా స్ప్రెడ్ చేసి.. సినిమాని కిల్ చేస్తున్నారనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయ్. కే-ర్యాంప్ మూవీ ప్రొడ్యూసర్ రాజేశ్ దండా.. తన కే-ర్యాంప్ మూవీపై.. ఓ వర్గం ఫేక్ ప్రచారం చేస్తోందని.. ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ వెబ్‌సైట్‌ని ఉద్దేశించి.. స్టేజీ మీదే ఆగ్రహంతో ఊగిపోయారు. సినిమాని తొక్కాలని చూస్తున్నారని.. ఇలాంటోళ్లని నడిరోడ్డు మీద ఉరి తీయాలని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. మిత్రమండలి మూవీ నిర్మాత బన్నీవాసు. ఇటీవలే.. మిత్రమండలి మూవీ ఈవెంట్‌లో నిర్మాత బన్నీ వాసు చేసిన కామెంట్స్ కూడా వైరల్ అయ్యాయి. తనని తొక్కాలని చూస్తున్నారని.. వాళ్లెవరూ తన వెంట్రుక కూడా పీకలేరని వార్నింగ్ ఇచ్చారు. ఒక సినిమాని తొక్కేస్తే.. ఇంకో సినిమా ఆడుతుందనే భ్రమలు పనికిరావన్నారు. నాగవంశీ వెబ్ సైట్లు, సోషల్ మీడియా రివ్యూలపై రియాక్ట్. ఆ మధ్య ప్రొడ్యూసర్ నాగవంశీ కూడా ఈ వెబ్ సైట్లు, సోషల్ మీడియా రివ్యూలపై రియాక్ట్ అయ్యారు. ఈ రివ్యూలే.. సినిమా సక్సెస్, ఫెయిల్యూర్‌ని డిసైడ్ చేస్తున్నాయన్నారు. చివరికి.. బుక్ మై షో యాప్‌లో లైకులకు కూడా డబ్బులిస్తున్నామన్నారు. యూట్యూబ్‌లో ట్రైలర్లకు వ్యూస్ పెంచుతున్నామన్నారు. కొందరు రివ్యూయర్లని ఉద్దేశిస్తూ.. తన సినిమాకు ప్రమోషన్ చేయొద్దని, రివ్యూలు రాయొద్దని కోరారు. అప్పట్లో.. నాగవంశీ వ్యాఖ్యలు హాట్ టాపిక్‌గా మారాయ్. సినిమాకు పాజిటివ్ రివ్యూ చెప్పేందుకు డబ్బులు డిమాండ్. ఈ మధ్యకాలంలోనే.. ఓ యూట్యూబ్ రివ్యూయర్.. తమ సినిమాకు పాజిటివ్ రివ్యూ చెప్పేందుకు డబ్బులు డిమాండ్ చేశాడని.. వర్జిన్ బాయ్స్ మూవీ ప్రొడ్యూసర్ రాజా దారపునేని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ప్రేక్షకులు ఇలాంటి రివ్యూలు నమ్మి మోసపోవద్దని సూచించారు. అప్పట్లో.. ఈ వ్యవహారం కూడా ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఇలా.. ఈ ఏడాదిలో.. ఈ రివ్యూల టాపిక్.. ఫిల్మ్ ఇండస్ట్రీలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా.. చిన్న సినిమాలు, కాస్త ఎక్కువ బడ్జెట్‌తో తీసిన సినిమాల విషయంలోనే ఇలా జరుగుతోంది. సినిమా రిలీజైన మొదటి రోజే వచ్చే రివ్యూలు, సోషల్ మీడియా, యూట్యూబర్లు, వెబ్ సైట్ రివ్యూలు.. ఆడియెన్స్‌ని బాగా ప్రభావితం చేస్తున్నాయనే ఆందోళన నిర్మాతలు వ్యక్తం చేస్తున్నారు. మంచి రివ్యూలు వస్తే.. మౌత్ టాక్ త్వరగా వ్యాపించి.. సినిమా కలెక్షన్స్ పెరిగే అవకాశం ఉంది. ఇదే సమయంలో.. నెగటివ్ రివ్యూలు వస్తే.. దాని ఎఫెక్ట్ భారీగా ఉంటుందని నిర్మాతలు చెబుతున్నారు. అది.. కలెక్షన్లను భారీగా దెబ్బతీసి, సినిమా ఫ్లాప్ అయి.. తామెంతో నష్టపోతున్నామని చెబుతున్నారు నిర్మాతలు. దీనిని అదునుగా చేసుకొని.. ఇండస్ట్రీలోనే కొందరు తమ సినిమాలను తొక్కేందుకు ప్రయత్నిస్తున్నారని.. చిన్న నిర్మాతలు బహిరంగంగానే వేదికలపై తమ ఆక్రోశాన్ని వెళ్లగక్కుతున్నారు. దాంతో.. ఈ వ్యవహారం ఇప్పుడు టాక్ ఆఫ్ ది టాలీవుడ్‌గా మారిపోయింది. ముఖ్యంగా కొన్ని వెబ్‌సైట్‌లు, యూట్యూబ్ ఛానెళ్లు.. సినిమాకు అనుకూలమైన రేటింగ్, రివ్యూ ఇచ్చేందుకు.. నిర్మాతల దగ్గర డబ్బులు డిమాండ్ చేస్తున్నారని.. బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. డిమాండ్ చేసినంత ఇవ్వకపోతే.. కావాలనే నెగటివ్ రివ్యూలు ఇస్తున్నారని తమ ఆక్రోశాన్ని వెళ్లగక్కుతున్నారు. ఇంకొందరు రివ్యూయర్లు.. సినిమా చూడకుండానే, పబ్లిసిటీ కోసం అతి చేసి.. తప్పుడు సమాచారం, అనవసరమైన విమర్శలతో రివ్యూలు ఇస్తున్నారని.. ఇది ఫిల్మ్ ఇండస్ట్రీకి ఎంతో నష్టం కలిగిస్తోందని.. నిర్మాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని వెబ్ సైట్లు.. కేవలం చిన్న సినిమాలపైనే దృష్టి పెట్టి, పెద్ద సినిమాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని.. దీని వల్ల తమకెంతో అన్యాయం జరుగుతోందని వాపోతున్నారు. డబ్బు కోసం పాజిటివ్ రివ్యూలు ఇచ్చేందుకు, ఇవ్వకపోతే.. నెగటివ్ రివ్యూలతో సినిమా వసూళ్లను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్న వారిని.. రివ్యూ మాఫియాగా చెబుతున్నారు. బెదిరించి.. తమను బ్లాక్‌మెయిల్ చేసిన వారిపై కొందరు నిర్మాతలు పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. ఏదేమైనా.. కొత్తగా రిలీజయ్యే సినిమా చూడాలా? వద్దా? అనే ఊగిసలాడే ఓ వర్గం ప్రేక్షకులపై మాత్రం.. ఈ రివ్యూల ఇంపాక్ట్ గట్టిగానే ఉందనేది మాత్రం వాస్తవం. అందువల్లే.. తాము నష్టపోతున్నామని చిన్న నిర్మాతలు ఇంత ఆవేదన వ్యక్తం చేస్తున్నారనే వాదన బలంగా వినిపిస్తోంది.ఓ సినిమా హిట్ అవ్వాలన్నా.. ఫట్ అవ్వాలన్నా.. దానిని డిసైడ్ చేసేది.. పబ్లిక్ టాకే. అయితే.. ఇప్పుడు రివ్యూలు కూడా సినిమా ఫ్యూచర్‌ని డిసైడ్ చేస్తుండటమే ఇండస్ట్రీపై ఎఫెక్ట్ పడుతుందోనే చర్చ జరుగుతోంది. వెబ్‌సైట్స్, మీమ్స్, ట్రోల్స్, హ్యాష్ ట్యాగ్స్.. ఇలా ప్రతీది.. సినిమా రిజల్ట్‌పై ఎంతో కొంత ఇంపాక్ట్ చూపుతున్నాయ్. వాస్తవానికి.. ఒకప్పటితో పోలిస్తే.. ఆరేడు ఏళ్ల నుంచే.. ఈ రివ్యూ ట్రెండ్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. గతంలో.. సినిమా రివ్యూలు అంటే.. జస్ట్ ఓవర్సీస్ మార్కెట్ వరకే పరిమితమయ్యేవి. కానీ.. ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో.. మూవీ రివ్యూలు, వెబ్‌సైట్లు, ట్రోలింగ్స్, మీమ్స్.. ఇలా అన్నీ ఓ మాఫియాలా క్రియేట్ చేయబడ్డాయి. కొత్తగా వచ్చిన సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, యూట్యూబ్ రివ్యూయర్లు, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్స్, మీమ్ పేజీలు.. ఇలా అంతా బ్లాక్ మెయిల్ చేసేదాకా వచ్చాయ్ పరిస్థితులు. వీళ్లలో.. కొందరిపై.. ఒకరిద్దరు నిర్మాతలు పోలీసు కేసులు కూడా పెట్టారు. అయోమయానికి గురిచేస్తున్న పీఆర్ టీమ్‌లు. నిజం చెప్పాలంటే.. ఇండస్ట్రీలో పక్క సినిమాలను తొక్కేసేందుకు ప్రయత్నిస్తున్నారనే అపవాదు ఎప్పటి నుంచో వినిపిస్తోంది. ప్రతివారం 4 నుంచి 6 సినిమాలు రిలీజవుతుంటాయ్. కొందరు ప్రొడ్యూసర్లు, హీరోలు.. తమ సొంత డిజిటల్ పీఆర్ సిస్టమ్‌తో.. ట్రైలర్లకు నెగటివ్ కామెంట్లు, డిస్ లైక్స్ లో రేటింగ్స్, బుక్ మై షో యాప్‌లో లైక్స్, రేటింగ్స్, ట్విట్టర్ హ్యాండిల్స్ ద్వారా నెగటివ్ క్యాంపెయిన్, పెయిడ్ హ్యాష్ ట్యాగ్స్ ట్రెండింగ్ లాంటివాటన్నింటికి.. డబ్బులిచ్చి మరీ పక్క సినిమాని తొక్కడం.. ఈ మధ్యకాలంలో ఇండస్ట్రీలో కామన్ అయిపోయిందనే చర్చ జరుగుతోంది. ఇంతేకాదు.. కొందరైతే ఫేక్ కలెక్షన్ పోస్టర్లు కూడా వేసి.. హీరో ఫ్యాన్స్‌ని, ప్రొడ్యూసర్లని, మూవీ టీమ్‌ని.. అయోమయానికి గురిచేస్తున్నారు. ఇదంతా.. కొన్ని పీఆర్ టీమ్‌లు ఆడుతున్న గేమే ఇదంతా అనే టాక్ వినిపిస్తోంది. కావాలనే.. ఇదంతా చేయిస్తున్నారని ప్రొడ్యూసర్లు అంటున్నారు. తమ సినిమాతో పాటు ఒకేవారం రిలీజయ్యే సినిమాని.. రేసులో లేకుండా చేసేందుకు.. అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నారని చెబుతున్నారు. ఓ వెబ్‌సైట్‌లో.. సినిమా యాడ్ డిస్ ప్లే కావాలంటే.. 60 వేలు అని, సినిమా ప్రమోషన్ ఆర్టికల్ రాస్తే 20 వేలు అని, ప్రీమియర్ షోలకు వెళ్లి.. స్పెషల్ రివ్యూ రాస్తే.. లక్ష దాకా సమర్పించుకోవాలని చెబుతున్నారు నిర్మాతలు. సోషల్ మీడియాలో సినిమా రివ్యూ పోస్ట్ చేసేందుకు కూడా 25 వేలు తీసుకుంటున్నారట. ఫస్ట్ హాఫ్ రివ్యూకు 20 వేలు, సెకండాఫ్ రివ్యూ కాస్త ఆలస్యంగా ఇచ్చేందుకు 30 వేలు ఇస్తున్నారట. ఇవన్నీ కాకుండా.. ఆ వెబ్‌సైట్ యాజమాన్యానికి.. సినిమా నిర్మాత లక్ష రూపాయల కవర్ పంపించాల్సిన పరిస్థితి ఉందంటున్నారు. అయితే.. ప్రొడ్యూసర్లు కూడా ఈ ట్రెండ్‌ని ఎంకరేజ్ చేస్తున్నారు. రివ్యూలు చెప్పేవాళ్లు, రాసేవాళ్లు డిమాండ్ చేసినంత డబ్బులు ఇస్తున్నారు. మూడు రోజుల వరకు రివ్యూలు రాకుండా చూడాలనే ఆలోచన. ప్రతి ప్రొడ్యూసర్ తన సినిమా జనాల్లోకి వెళ్లాలనే ఉద్దేశంతో.. సొంతంగా ఎంతైనా ఖర్చు పెట్టేందుకు వెనుకాడటం లేదు. దీనిని అదునుగా చేసుకొని.. ప్రమోషన్ల పేరిట.. పీఆర్ టీమ్‌లు కూడా విచ్చలవిడిగా ఖర్చు పెట్టిస్తున్నాయనే చర్చ ఉంది. నిర్మాతలు కూడా ఈ విషయంలో ఏమీ ఆలోచించడం లేదు. సొంతంగా నిర్ణయం తీసుకొని.. లక్షలు ఖర్చు పెడుతున్నారు. కానీ.. రిజల్ట్ చూశాక దెబ్బ గట్టిగా పడుతోంది. దాంతో.. ఇబ్బందులు పడుతున్నారు. అయితే.. ఇండస్ట్రీలోని నిర్మాతలంతా.. ఒకే తాటి మీదకు వచ్చి.. ఓ నిర్ణయం తీసుకుంటే.. రివ్యూయర్లను కట్టడి చేయొచ్చంటున్నారు. గతంలో.. 3 రోజుల వరకు రివ్యూలు రాకుండా చూడాలని.. ఫిల్మ్ ఛాంబర్ నిర్ణయించినప్పటికీ.. అది ఇప్పటికీ అమల్లోకి రాలేదు. దాంతో.. కోట్లు ఖర్చు పెట్టి.. ఏళ్లు కష్టపడి ఓ సినిమా తీస్తే.. 3 గంటల సినిమా చూసి.. 3 నిమిషాల్లో రివ్యూ రాసేసి.. సినిమాను చంపేస్తున్నారనే వాదన వినిపిస్తోంది.

# దేశంలోనే బెస్ట్‌గా శ్రీసిటీ

**విశాఖపట్టణం, సూర్యవాస్తవం:** ప్రఖ్యాత పారిశ్రామిక వాడ శ్రీసిటీకి మరిన్ని మెరుగులు దిద్ది, దేశంలోనే బెస్ట్గా రూపొందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. పెట్టుబడుల సదస్సులో భాగంగా శనివారం పలు కీలక రంగాల్లో పెట్టుబడులపై ఒప్పందాలు జరిగాయి. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఎఫ్), రేమాండ్, శ్రీసిటీల ప్రతినిధులు చంద్రబాబు సమక్షంలో ఒప్పందాలపై సంతకాలు చేశారు. శ్రీసిటీకి సంబంధించిన ఐదు యూనిట్లను చంద్రబాబు వర్చువల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీసిటికి సంబంధించిన మరో 12 సంస్థలకు సంబంధించిన పెట్టుబడులపై సంతకాలు జరిగాయి. ఇంజనీరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, ఫార్మా ఉత్పత్తులకు సంబంధించి రూ.2,320 కోట్లతో ఈ నిర్మాణాలు జరుగుతాయి. దీనివల్ల 12,365 మందికి ఉద్యోగావకాశాలు కూడా లభిస్తాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ శ్రీసిటీ అన్నది దేశంలోనే అతి పెద్ద పారిశ్రామిక కారిడార్గా గుర్తింపు పొందిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో 30 వరకు పరిశ్రమలు ఉన్నాయని, త్వరలోనే 50 పరిశ్రమల స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. శ్రీసిటీ అభివృద్ధికి త్వరలోనే ఆరు వేల ఎకరాల భూమిని అందుబాటులోకి తీసుకువస్తామని చంద్రబాబు ప్రకటించారు. శ్రీసిటీలో 50 దేశాలకు చెందిన సంస్థల ద్వారా 1.5 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. సంస్థల రవాణా అవసరాల కోసం ఒక ఎయిర్‌పోర్ట్ కూడా నిర్మించనున్నట్లు చెప్పారు. ఇప్పటికే బెల్జియం, జపాన్, బ్రిటన్, జర్మనీ, ఆస్ట్రేలియా వంటి దేశాల నుంచి హెల్త్కేర్, ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్, ఆటోమొబైల్, వైద్య పరికరాలవంటి వాటికి 8.87 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం ఇచ్చినట్లు చంద్రబాబు చెప్పారు. ఇక్కడ ఏర్పాటవుతున్న సంస్థల్లో వచ్చే ఒక సంస్థ ఉత్పత్తులు ఇంకో సంస్థకు ముడిసరుకుగా మారుతాయని, దీనివల్ల ఉత్పత్తి వ్యయం కూడా తగ్గుతుందని అన్నారు. 2028 నాటికి శ్రీసిటీని అత్యుత్తమ పారిశ్రామిక ప్రాంతంగా మారుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ ఎమి రవి సానారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో మరింతగా అభివృద్ధి సాధించేందుకు ప్రయత్నిస్తామన్నారు. వీలయినన్ని ఎక్కువ సంస్థలు ఇక్కడకు వచ్చేలా చూస్తామని హామీనిచ్చారు.

### మూడు ప్రాంతాల్లో రేమాండ్

రేమాండ్ సంస్థతో కూడా అనేక ఒప్పందాలపై కూడా సంతకాలు జరిగాయి. మొత్తం మూడు ప్రాంతాల్లో రేమాండ్ సంస్థ పెట్టుబడులు పెడుతున్నట్లు చంద్రబాబు చెప్పారు.



అనంతపురం జిల్లా రాప్తాడులో రూ.497 కోట్ల వ్యయంతో సిల్వర్ స్పార్క్ అపెరల్ యూనిట్ను ఏర్పాటుచేస్తున్నారు. అలాగే గుడిపల్లిలో రూ.441 కోట్లతో ఆటో కాంపోనెంట్ తయారు ప్లాంటును కియా ప్లాంట్కు దగ్గరలోనే ఏర్పాటుచేయనున్నారు. అదే జిల్లా తెలుకోడులో రూ.262 కోట్లతో ఏరో స్పేస్ పరికరాల తయారీ కేంద్రాన్ని కూడా ఏర్పాటుచేస్తున్నారు. ఈ మూడు పరిశ్రమల వల్ల 6,500 మందికి ఉపాధి లభిస్తుంది. 20 లక్షల మందికి ఉపాధి కల్పించాలన్న లక్ష్యాన్ని 3, 4 సంవత్సరాల్లోనే సాధిస్తామని చంద్రబాబు వెల్లడించారు. ఈ మూడు పరిశ్రమలను 2027 నాటికి ప్రారంభిస్తామని ఆ సంస్థ ప్రతినిధులు జతిన్ ఖన్నా, గౌతం మైనీ ప్రకటించారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మరో ఒప్పందం కుదిరింది. రాష్ట్రంలో సెంటర్ ఫర్ ఎనర్జీ, సైబర్ రెజిలియన్స్ కేంద్రం ఏర్పాటు చేసేందుకు ఈ ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ప్రపంచం అంతా గ్రీన్ ఎనర్జీపైనే ఆలోచన చేస్తోందన్నారు. రాష్ట్రంలో 165 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నామని, అతి తక్కువ వ్యయంతో విద్యుదుత్పత్తి చేయాలన్నది లక్ష్యమని చెప్పారు. ఇంధన రంగానికి అవసరమైన సైబర్ రక్షణ వ్యవస్థను కూడా ఏర్పాటుచేయాల్సి అవసరం ఉందని వ్యాఖ్యానించారు. విద్యుత్ పంపిణీలో నష్టాలను అధిగమించడం, సరఫరా వ్యయం తగ్గించడం ద్వారా ఇంధన రంగంలో సుస్థిరత సాధ్యపడుతుందన్నారు. ప్రపంచ ఆర్థిక వేదిక ఎమి జెర్మీ జుర్గెన్స్ మాట్లాడుతూ ఎఐ ట్రాన్సిషన్ సమయంలో ఇంధన వ్యవస్థల భద్రత అత్యంత కీలకమని వ్యాఖ్యానించారు. ఈ విషయంలో రాష్ట్రంలో తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. దేశవ్యాప్తంగా విద్యుత్ ఉత్పత్తి, ఇంధన భద్రత రంగాల్లో వేగవంతమైన నిర్ణయాలు జరుగుతున్నాయని చెప్పారు. ఇటువంటి సమయంలో భద్రతపై రక్షణ వ్యవస్థలు కీలకమని, దీనికోసం నిపుణులతో కూడిన మానవ వనరులను తయారు

## ఎర్రచందనం అక్రమ రవాణా

# నిరోధానికి పటిష్ట ప్రణాళిక

### ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశం



**అమరావతి :** ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి పటిష్ట ప్రణాళికను రూపొందించాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఎర్రచందనం పరిరక్షణ, అక్రమ రవాణా నిరోధానికి ఉన్న మార్గాలపై అటవీశాఖ ఉన్నతాధికారులతో శనివారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవస్థలన్నీ సమన్వయంతో పనిచేస్తే అక్రమార్కుల ఆటకట్టించడం అసాధ్యం కాదని చెప్పారు. అక్రమ రవాణా నిరోధానికి అందుబాటులో ఉన్న సాంకేతిక వినియోగానికి తోడు సిబ్బంది కృషి చాలా అవసరమని పవన్ కల్యాణ్ చెప్పారు. టెక్నాలజీతో పాటు సంకల్పం తోడైతేనే అక్రమ రవాణాను నిరోధించగలమని తెలిపారు. పోలీస్, అటవీ అధికారుల ఆధ్వర్యంలో నిరంతరం ఎర్రచందనం స్మగ్లింగ్ జరిగే అవకాశం ఉన్న ఎగ్జిట్, ఎంట్రీ పాయింట్ల వద్ద థర్మల్ డ్రోన్లతో నిఘాను పెంచాలని ఆదేశించారు. అటవీ చెక్ పోస్టులను మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు సిసి కెమెరాలను అమర్చి, నిత్యం పర్యవేక్షణ చేయాలని తెలిపారు. సరికొత్త బారికేడ్లను చెక్‌పోస్టుల వద్ద అమర్చి, బేస్ క్యాంపులు, వాచ్ టవర్లలో గస్తీ ముమ్మరం చేయాలని పేర్కొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయంలో స్వచ్ఛ భారత్



**కనేకల్ – సూర్య వాస్తవం, నవంబర్ 15:** మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో మూడో శనివారం సందర్భంగా స్వచ్ఛ భారత్ శుభ్రత కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, అధికారులు మరియు స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు. ఉదయం కార్యక్రమాన్ని రీ సర్వే డిప్యూటీ తహసిల్దార్ విజయ్ కుమార్ ప్రారంభించి, ప్రజలు తరచుగా వచ్చే ప్రభుత్వ కార్యాలయాలు పరిశుభ్రంగా ఉండడం ఎంతో ముఖ్యమని వివరించారు. అనంతరం సిబ్బందిని బృందాలుగా విభజించి, కార్యాలయ ఆవరణం, గది గదుల్లో శుభ్రత పనులను చేపట్టారు. చెత్తను తొలగించడం, ఎండిన ఆకులను సేకరించడం, మార్గాలు మరియు పార్కింగ్ స్థలాలను శుభ్రపరచడం వంటి పనులునిర్వహించారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు పరిశుభ్రత, చెత్త వర్గీకరణపై అవగాహన సందేశాలు కూడా అందించారు. ఈ సందర్భంగా రీ సర్వే డిప్యూటీతహసిల్దార్ విజయ్ కుమార్ మాట్లాడుతూ, ఇటువంటి నియమిత శుభ్రత కార్యక్రమాలు కార్యాచరణలో మెరుగుదలకు, సిబ్బందిలో బాధ్యతాభావం పెంచుతాయని పేర్కొన్నారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా సేకరించిన చెత్తను సక్రమంగా పారవేసి, స్వచ్ఛ భారత్ స్ఫూర్తిని కొనసాగించాలని అన్నారు.

## పరిసరాలని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత

**- స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్రలో ఎంపీడీవోతేజోష్ణ**




**పామిడి - సూర్య వాస్తవం, నవంబర్ 15 :** పామిడి మండలంలో ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పామిడి మండల పరిధిలోని 20 గ్రామపంచాయతీలలో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా, 3 వ శనివారం (వ్యక్తిగత, సమాజ పరిశుభ్రత) కార్యక్రమము నిర్వహించడం జరిగినది. బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయకూడదని, బహిరంగ మూత్ర,మల విసర్జన చేయకూడదని, పబ్లిక్ టాయిలెట్లను వినియోగించుకోవాలని ఎంపీడీవో తేజోష్ణ నేతృత్వంలో టీసి ప్రభుత్వ హై స్కూల్లో అవగాహన కల్పించి గ్రామపంచాయతీ నుండి బీసీసీ రోడ్డు ఎద్దులపల్లి సర్కిల్ వరకు ర్యాలీగా స్వచ్ఛ ఆంధ్రపై అవగాహన ర్యాలీ, ప్రచార కార్యక్రమాలు చేపట్టి, ప్రతి కుటుంబం తమ ఇళ్లతో పాటు పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచాలని ప్రజలకు తెలియజేశారు ప్రతినిధులు, పొదుపుసంఘాల మహిళలు, అధికారులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకలో పాల్గొన్న, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి, చెన్నకేశవరెడ్డి



**పామిడి - సూర్య వాస్తవం, నవంబర్ 15 :** గుంతకల్ నియోజకవర్గం పామిడి మండలం కండ్లపల్లి గ్రామం వెంకటేశ్వర రెడ్డి పిలుపుమేరకు వారి కుమారుడు పవన్ కుమార్ రెడ్డి వివాహ కార్యక్రమానికి ముఖ్య అతిధిలుగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన అనంతపురం వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డమ్మ, అనంతపురం జిల్లా, వైఎస్ఆర్సిపి ఆర్గనైజేషన్ సెక్రటరీ పెమ్మక చెన్నకేశవరెడ్డి ఆశీర్వదించడం జరిగింది ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ నాయకులు, పామిడి టౌన్ కన్వీనర్ నాగూర్ ఈశ్వర్ రెడ్డి, బైప్ రెడ్డి, మనోహర్ రెడ్డి, శ్రీరామ్ రెడ్డి, అనంతపురం జిల్లా వైఎస్ఆర్సిపి జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి, పామిడి సూరి, రామిరెడ్డి, నాగేష్ యాదవ్, రమేష్ కొత్తపల్లి, వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## నవంబర్ 17 న చలో ఢిల్లీ దళితుల ఆత్మగౌరవ ప్రదర్శన జయప్రదం చేయండి

**- ఎం.ఈ.ఎఫ్ బొడ్డు గోల నారాయణప్ప**



**తనకల్లు - సూర్య వాస్తవం, నవంబర్ 15:** చలో ఢిల్లీ దళితుల ఆత్మగౌరవ ప్రదర్శన జయప్రదం చేయండి ఎం ఈ ఎఫ్ నాయకులు బొడ్డు గొల్ల నారాయణప్ప మాట్లాడుతూ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బి ర్ గవాయ్ పై సుప్రీంకోర్టులోనే అక్టోబర్ 6 దాడి చేయడం జరిగినది. దళిత సామాజిక వర్గానికి చెందినవారు. ఎంతో కష్టపడి న్యాయ వ్యవస్థలో సి జె ఐ స్థాయికి చేరుకున్న అయితే దళితులు ఉన్నత స్థాయిలో ఉండడం చూసి కొందరు జీర్ణించుకోలేక వాపోతున్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే, బిఆర్ అంబేద్కర్,ఇచ్చిన స్ఫూర్తితో దళితుల ఆత్మగౌరం కాపాడుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్ద ఎత్తున నవంబర్ 17న చలో ఢిల్లీ లో ఉదయం 11 గంటలకు దళితుల ఆత్మగౌరవ ప్రదర్శన లో పాల్గొనవలసిందిగా ఎం ఈ ఎఫ్ నాయకులు బొడ్డుగల నారాయణప్ప పేర్కొన్నారు.

# ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు బీర్సా ముండా

**• జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు**






**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం, నవంబర్ 15:** ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు బీర్సా ముండా అని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు కొనియాడారు. శనివారం ఉదయం రాయచోటి కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో ఆదివాసీల్లో తొలి విప్లవ వీరుడైన బీర్సా ముండా జయంతిని పురస్కరించుకొని జన జాతీయ గౌరవ దివస్ వేడుకలను ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి బీర్సా ముండా, బాబాసాహెబ్ అంబేద్కర్, సేవాలాల్ మహారాజ్, చిత్రపటాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన బీర్సా ముండా జయంతి నవంబర్ 15 ను “జన జాతీయ గౌరవ దివస్” గా జరుపుకోవడం, వారిని స్మరించుకోవడం ఆనంద దాయక మన్నారు. ఆదివాసీల్లో విప్లవ భావాలను రగిలించిన తొలి వీరుడు బీర్సాముండా అని కొనియాడారు. ప్రజలు ఎన్నుకున్న రాజ్యాన్ని స్థాపిద్దాం అనే నినాదాలతో ఆదివాసీలను తిరుగుబాటు వైపు నడిపించాలన్నారు. జార్ఖండ్ ప్రాంతంలో జన్మించిన ఈయనను... ముండా తెగకు చెందిన ప్రజలు ఆయన దేవునిగా భావించి “భగవాన్” అని పిలిచేవారని, ఆదివాసీల సాగుభూములపై విధిస్తున్న పన్నులకు వ్యతిరేకంగా బ్రిటిష్ వారిపై పోరాడి అమరుడయ్యారని పేర్కొన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని సంతల్ తదితర తెగలవారు తమ హక్కులను సాధించుకున్నారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలను, పథకాలను రూపొందించిందని, వీటిని ఆదివాసీ ప్రజలు, విద్యార్థులు ఉపయోగించుకొని మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి తేజస్విని మాట్లాడుతూ. బిర్సా ముండా జయంతిని జన జాతీయ గౌరవ దివస్ గా భారత కేంద్ర ప్రభుత్వం గుర్తించిందని, ఈ గుర్తింపు ఆదివాసీలందరూ గర్వించదగ్గ విషయం అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ కార్యక్రమాలు, పథకాలను ఆదివాసి విద్యార్థిని విద్యార్థులు ఉపయోగించుకొని మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. ధర్తీ ఆభ జనజాతీయ గౌరవ దివాస్ ధర్తీ ఆభ వేడుకలు అన్నమయ్య జిల్లాలో ఘనంగా నిర్వహించారు. బిర్సాముండా 150 వ జయంతి వేడుకలు లలో భాగంగా తేది నవంబర్ 1 నుండి నవంబర్ 15 వరకు ధర్తీ ఆభ జనజాతీయ గౌరవ దివాస్ వేడుకలు అన్నమయ్య జిల్లాలో గణంగా జరిగాయి. చెట్ల పెంపకం, పుష్ప నివాళి సంబరాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా కార్యక్రమాలు, సాంప్రదాయ గిరిజన నృత్య కార్యక్రమాలు, తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. అందులో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతి ప్రధానం జిల్లా రెవెన్యూ అధికారి చేతుల మీదుగా అందజేశారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారి తేజస్విని , సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు, జిల్లాలోని గిరిజన సంక్షేమ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సతీష్ కుమార పార్థివదేహానికి నివాళి

**• ఎమ్మెల్యే శ్యామ్ కుమార్**



**పత్తికొండ టౌన్ – సూర్య వాస్తవం, నవంబర్ 15:** నిన్నటి రోజు దారుణ హత్య గురైన సతీష్ పార్థివదేహానికి పత్తికొండ నియోజకవర్గం శాసనసభ సభ్యులు కే.ఈ.శ్యామ్ కుమార్ పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే గారు పత్తికొండ ఒడి లో పుట్టి పెరిగిన ఒక నిజాయితీ గల ఆఫీసర్ ను కోల్పోయింది మన పత్తికొండ. సతీష్ మరణించిన తీరుని ఆ వీడియో చూస్తే తెలుస్తుంది అది ఆత్మహత్య లేక హత్యా అని. ఎలాంటి విచారణ జరగలేదు. కాని నిన్నటి రోజు వైఎస్ఆర్సిపి వాళ్లే తేల్చి చెప్పారు వైఎస్ఆర్సిపి అధికారిక ఫేస్ బుక్ ద్వారా సతీష్ ది ఆత్మహత్య అని. చావును రాజకీయంగా చేయడం మీకే చెల్లు. మరి ఇంతలా దిగజారుడు రాజకీయం. పేదరికంలో పుట్టి కష్టపడి చదివి ఒక మంచి పోలీస్ ఆఫీసర్ గా పేరు తెచ్చుకున్న సతీష్ కుమార్ ను పరకామణి చోరీ కేసులో సి బి సి ఐ డి ముందు తన స్టేట్మెంట్ ఇస్తే వైసిపి పెద్ద నాయకుల పేర్లు బయటికి వస్తాయని విచారణకు వెళ్తున్న సతీష్ కుమార్ ను దారుణంగా హత్య చేశారు. ఒక్కసారి రాష్ట్ర ప్రజలు,పత్తికొండ నియోజకవర్గం ప్రజలు ఆలోచించండి. మనం ఏ పార్టీకి మద్దతిస్తున్నాము నీతి నిజాయితీగల పార్టీ ఏదో ఏ పార్టీ ద్వారా అటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము ఇటు పత్తికొండ నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందో ఆలోచించండి. వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి సొంత బాబాయి వివేకానంద రెడ్డిని గొడ్డలిపోటుతో చంపి గుండెపోటు అని చెప్పిన మాటలు అలాగే పెత్తందారి వ్యవస్థకు ఎదిరెడ్డి బడుగు బలహీన వర్గాల కోసం పోరాడిన పరిటాల రవి ని చంపిన హత్య కేసులో ముద్దాయిలు ఏ విధంగా ఒకరి తర్వాత ఒకరు దారుణ హత్యలకు గురికావడం ఒక్కసారి ప్రజలు గుర్తుకు తెచ్చుకోండి. తిరుమల వెంకటేశ్వర స్వామి పరకామణి (హుండీలోని సొమ్ము) లోని కోట్ల రూపాయలను వైవి.సుబ్బారెడ్డి భూమన కరుణాకర్ రెడ్డి అనుచరుడు రవి కుమార్ డబ్బులను దొంగలిస్తుండగా రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్న ఏవీఎస్ఓ సతీష్ కుమార్ను సిబి సిఐడికి విచారణకు వస్తుండగా దారుణంగా హత్య చేసిన వైసిపి నాయకులు ఈ నిందను ప్రభుత్వం పైకి అధికారుల పై నెట్టడం హాస్యాస్పదంగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా వైసిపి శవ రాజకీయాలు చేస్తుందో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు. సతీష్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది. అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు.

# మన ఆరోగ్యం - మన పరి శుభ్రత పై అవగాహన ర్యాలీ




**గుత్తి - సూర్య వాస్తవం, నవంబర్ 15:** గుత్తి మున్సిపాలిటీ పరిధిలో క మీషనర్ బి.జబ్బార్ మియా ఆ ధ్వర్యంలో గుత్తి ఆర్.యస్ గుడ్ విల్ స్కూల్ యాజమాన్యం సహ కారంతో స్వర్ణ ఆంధ్రప్రదేశ్-స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగం గా స్వచ్ఛ గుత్తిని సాధిద్దాం అనే నినాదంతో మన ఆరోగ్యం-మన పరిశుభ్రత కార్యక్రమం పై అవగా హన ర్యాలీ కార్యక్రమం జరిగిన ది.ఈ మున్సిపల్ కమీషనర్ బి. జబ్బార్ మియా,మున్సిపల్ మే నేజర్ రాంబాబు,గుడ్ విల్ స్కూ ల్ కరస్పాండెంట్ యోగేందర్,మె ప్మా టి.యం.సి శ్రీనివాసరెడ్డి కా ర్యక్రమం మార్గదర్శకాలు తెలియజేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్ర భుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో మార్గదర్శకాలు ప్రకారం పిల్లలు, తల్లితండ్రులు పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన తెలిపారు. అనంత రం గుడ్ విల్ స్కూల్ నుండి మ హాత్మా జ్యోతి రావు పూలే సర్కిల్ వరకు ర్యాలీ ద్వారా పరిశుభ్రత పై అవగాహన చేపట్టడం జరిగిన ది.ఈ కార్యక్రమంలో శానిటేషన్ సెక్రెటరీలు, మెప్మా సిబ్బంది, మెప్మా ఆర్.పిలు, మున్సిపల్ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, మున్సిపల్ వర్కర్క పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు. అని మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా చెప్పడం జరిగింది.

## పార్కు నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



**కుప్పం - సూర్య వాస్తవం, నవంబర్ 15 :** కుప్పం పట్టణంలో జమీందారుల కాలంలో నిర్మించిన సెంట్రల్ పార్క్ అభివృద్ధి పనులకు ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. అమరావతి అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించిన ప్రసిద్ధ సుర్భాన కంపెనీ ద్వారా కుప్పం సెంట్రల్ పార్క్‌కు పునర్ నిర్మాణానికి ఆధునిక మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారు. కుప్పం పట్టణ నడిబొడ్డున ఉన్న రెండు ఎకరాల స్థలంలో సుమారు రూ. 10 కోట్ల వ్యయంతో సెంట్రల్ పార్క్‌ను ఆధునీకరించే పనులు చేపట్టనున్నారు. ఇందులో నడక మార్గాలు,హరితవనం, పిల్లల వినోద పార్క్, సౌకర్య వంతమైన కూర్చునే ప్రదేశాలు, అలంకరణ లైటింగ్ వంటి అనేక ఆధునిక సదుపాయాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ రత్నం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ కు పట్టణంలోని పార్కు యొక్క విశేషాలను తెలియజేశారు. కంగుంది సంస్థానాధీశులు కంబినాయుని జవ్వాజి వెంకటాద్రినాయుడు పేరు మీదుగా నిర్మించిన పార్కు పూజా కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, పిఎంకె ఉడా చైర్మన్ డాక్టర్ బి.ఆర్ సురేష్ బాబు, రెస్కో చైర్మన్ వీజీ ప్రతాప్, మున్సిపల్ చైర్మన్ సెల్వ రాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ డి సుధీర్, మాజీ జెడ్పిటిసి రాజ్ కుమార్, కాణిపాకం దేవస్థానం డైరెక్టర్ నరేష్, కౌన్సిలర్లు జిమ్ దాము, డిష్ వేలు, కొత్తపేట క్లస్టర్ ఇంచార్జ్ కన్నన్, నేతలు పి గోపీనాథ్, సత్యేంద్ర శేఖర్, శివకుమార్, ఆర్ఆర్ రవి, ఉమాపతి, అధికారులు మున్సిపల్ కమిషనర్ వి. శ్రీనివాసరావు, ఇతర నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.



## పీఎం ఏవై ఆవాస్ యోజన లబ్ధిదారులను గుర్తిస్తున్న అధికారులు



**గాండ్లపెంట - సూర్య వాస్తవం, నవంబర్ 15:** పీఎం ఏవై ఆవాస్ యోజన పథకం కింద సంబంధిత హౌసింగ్ అధికారులు లబ్ధిదారులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు సంబంధిత గ్రామ సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు గ్రామాల బాటపడుతున్నారు. ముఖ్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నెల 30వ తేదీ వరకు గడువు విధించడంతో అధికారులు లబ్ధిదారులు గుర్తించేందుకు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. ఈ మేరకు శనివారం మండలంలోని చామాలగొంధి, కటారుపల్లి, వేపరాల కురుమామిడి, సోమయాజులపల్లి, గాండ్లపెంట, మల్ల మీద పల్లి, తుమ్మలబైలు తదితరు గ్రామాల్లో సంబంధిత అధికారులు జియో టాకింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. చామాల గొంది గ్రామంలో సర్పంచ్ శివపనాయుడు ఆధ్వర్యంలో లబ్ధిదారులను గుర్తించేందుకు జియో టాకింగ్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రఫీక్, సచివాలయ సిబ్బంది బ్రహ్మానందరెడ్డి, తిప్పారెడ్డి, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## నూతన గృహ ప్రవేశానికి ముఖ్య అతిథిగా బీఎస్పీ పార్టీ నాయకుడు



**గుత్తి - సూర్య వాస్తవం, నవంబర్ 15:** గుత్తి పట్టణంలోని గుట్టమీద కాలనీలో నూతన గృహప్రవేశానికి ముఖ్య అతిథులుగా గుత్తి మండలం బీఎస్పీ పార్టీ నాయకుడు యం.రామాంజనేయులు పాల్గొనడం జరి గినది. ఈ కార్యక్రమంలో బీఎస్పీ పార్టీ నాయకుడు యం.రామాంజనేయులు, రాముడు సంజీవ, గద్దల మోహన్ బాబు, ఓబులపతి, నర సింహులు, రంగనాయకులు, పవన్ రంగముని, రమేష్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# టీడీఎస్ చెల్లింపుల్లో తప్పనిసరిగా జీఎస్‌టీఐఎన్ స్టేటస్ తనిఖీ చేయాలి

**• కలెక్టర్ నిశాంత్ కుమార్ ఐఏఎస్**





**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, నవంబర్ 15:** ఆంధ్రప్రదేశ్ వస్తువులు, సేవల పన్ను చట్టం , 2017 కింద పన్ను చెల్లింపుదారులకు చెల్లింపులు చేసే విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అన్నమయ్య జిల్లా రాయచోటి లో ఈరోజు (శనివారం) ఒక అవగాహన సదస్సు జరిగింది. రద్దు చేయబడిన పన్ను చెల్లింపుదారుల ఖాతాలకు టీడీఎస్ జమ చేయడం వల్ల భారీగా రెవెన్యూ నష్టం జరుగుతోందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఐఏఎస్, వాణిజ్య పన్నుల సంయుక్త కమిషనర్ జి.సుమతి, యస్. సుమయ అసిస్టెంట్ కమిషనర్, రాయచోటి, చిరంజీవి, అసిస్టెంట్ కమిషనర్, మదనపల్లి అవగాహన కలిపించారు. టీడీఎస్ మినహాయించే ముందు, సంబంధిత కాంట్రాక్టర్ లేదా సరఫరాదారు యొక్క జీఎస్‌టీఐఎన్ యొక్క స్థితిని తప్పనిసరిగా తనిఖీ చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్, జాయింట్ కమిషనర్ శ్రీమతి జి. సుమతి ఉద్ఘాటించారు. జీఎస్‌టీఐఎన్ 'యాక్టివ్' గా ఉందో లేదో నిర్ధారించుకోవాలని వారు సూచించారు. జీఎస్‌టీఐఎన్ రద్దు చేయబడిన పన్ను చెల్లింపుదారుల ఖాతాలకు టీడీఎస్ మొత్తాలను జమ చేయడం వలన ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో ఆదాయ నష్టం జరుగుతోందని అధికారులు తెలిపారు. ఎం.జి.ఎన్.ఆర్. ఈ.జి.ఎస్. నిధులను విడుదల చేసిన నేపథ్యంలో, వివిధ శాఖల అధికారులు యాక్టివ్‌గా ఉన్న పన్ను చెల్లింపుదారులకు మాత్రమే టీడీఎస్ జమ చేయాలని, తద్వారా పన్ను ఏకకాలంలో వసూలు అయ్యేలా చూడాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. పన్ను చట్టాలను పకడ్బందీగా అమలు చేయడం, ప్రభుత్వ ఆదాయాన్ని పరిరక్షించడంపై ఈ సమావేశంలో ప్రధానంగా దృష్టి సారించారు. ఈ సదస్సుకు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఐఏఎస్, వాణిజ్య పన్నుల శాఖ సంయుక్త కమిషనర్ జి. సుమతితో పాటు జాయింట్ కలెక్టర్ శ్రీ ఆదర్శ్ రాజేంద్రన్, ఐఏఎస్ కూడా హాజరయ్యారు. వివిధ ఇంజినీరింగ్ శాఖలకు చెందిన టీడీఎస్ డిడక్టర్లు ఈ సమావేశంలో పాల్గొని ముఖ్య సూచనలు జారి చేశారు.

## శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయంలో

# చైర్మన్ సాయిప్రసాద్ ఆకస్మిక తనిఖీ

**• అధిక రుసుములపై నిఘా • భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని భక్తులకు హామీ**



**శ్రీకాళహస్తి - సూర్య వాస్తవం, నవంబర్ 15:** శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి ఆలయంలో భక్తుల సౌకర్యం, పారదర్శకతను మెరుగు పరచాలనే లక్ష్యంతో శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి ఆలయ పాలకమండలి చైర్మన్ కొట్టే సాయిప్రసాద్ శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అన్నప్రసాద కాంటీన్ ప్రాంతం, భద్రత సిబ్బంది విధులు, క్యూ లైన్ వ్యవస్థతో పాటు ఫోన్ - బ్యాగ్ భద్రపరచే కౌంటర్లు వంటి కీలక ప్రాంతాలను స్వయంగా సందర్శించి పరిశీలించారు. ఇటీవలి కాలంలో ఫోన్, లగేజిని భద్రపరచే కేంద్రాల్లో అధిక రుసుములు వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులు రావడంతో, చైర్మన్ అక్కడికే వెళ్లి వివరాలను సేకరించారు. భక్తులతో నేరుగా మాట్లాడి ఎలాంటి అసౌకర్యాలు ఎదురవుతున్నాయో తెలుసుకున్నారు.

**నిఘా కేంద్రాలు కూడా పరిశీలన:** ఆలయంలో ఏర్పాటు చేసిన నిఘా కేంద్రాలను చైర్మన్ తనిఖీ చేశారు. భద్రత, క్రమశిక్షణ, క్యూ లైన్ నియంత్రణ, దళారుల దూకుడును అరికట్టడంలో ఈ నిఘా కేంద్రాల పాత్రను సమీక్షిస్తూ సిబ్బందికి అవసరమైన సూచనలు ఇచ్చారు. శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దర్శనానికి వచ్చే సామాన్య భక్తులకు ఎలాంటి అసౌక్యం కలగకుండా వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తానని అధిక రుసుములు వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని చైర్మన్ కొట్టే సాయిప్రసాద్ భక్తులకు హామీ ఇచ్చారు. ఆలయ పరిసరాల్లో పారదర్శకత, భక్తుల భద్రత, సౌకర్యం, సేవా ప్రమాణాలను మరింత మెరుగు పరచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు చైర్మన్ పేర్కొన్నారు.

# కనేకల్లులో స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర



**కనేకల్ - సూర్య వాస్తవం, నవంబర్ 15 :** కనేకల్ మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో శనివారం స్వర్ణ ఆంధ్ర%-%స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి వ్యర్థాల నిర్వహణపై విశేష అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మాట్లాడిన ఇంచార్జ్ పంచాయతీ కార్యదర్శి (డిప్యూటీ ఎంపీడీవో) పి .చంద్రమౌళి మాట్లాడుతూ, "వ్యర్థాల నిర్వహణలో ప్రతి పౌరుడూ బాధ్యతతో వ్యవహరించాలి. గ్రామాన్ని శుభ్రంగా, సుభిక్షంగా ఉంచడం అందరి సహకారంతోనే సాధ్యం" అని పేర్కొన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పంచాయతీ వాహనాలు వచ్చినప్పుడు వాటిలో సక్రమంగా వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. యువతరం స్వచ్ఛ భారత్ లక్ష్యాలను సాధించడంలో ముందుండాలని, ప్రతి గ్రామం స్వచ్ఛ గ్రామంగా మారేందుకు సహకరించాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో మేజర్ గ్రామపంచాయతీ, గ్రామ సచివాలయ సిబ్బంది, మండల కార్యాలయం సిబ్బంది,సీడీపీఓ నాగమణి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మట్కా స్థావరాలపై పోలీసుల దాడులు ఇద్దరు అరెస్ట్



**గుత్తి - సూర్య వాస్తవం, నవంబర్ 15:** గుత్తి పట్టణంలో మట్కా స్థావరా లపై పోలీసులు భారీ స్థాయిలో దాడులు నిర్వహించారు. గుత్తి అర్బన్ సీఐ రామారావు,ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. అమృత టాకీస్ వెనకాల కాలనీ ప్రాంతం, అలాగే గుంత కల్లు రోడ్లోని అంబేద్కర్ నగర్ ప్రాంతాల్లో శనివారం పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ చర్యల్లో భాగంగా నగదాని శివ, దూదేకుల ముబారక్ అనే మహి ళను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు వారి వద్ద నుంచి రూ. 62,000 నగదు, పెద్ద మొత్తంలో మట్కా చీటీలను స్వాధీనం చేసు కుని కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఏఎస్ఐలు నాగమణిక్యం, రామాంజనేయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. పోలీసులు మట్కా కార్యకలాపాలను నిర్మూలించేందుకు దాడులు కొనసాగుతాయని తెలిపారు.

# కలెక్టర్ ఆదేశాలతో గాంధీ తాతకు మోక్షం

**చేజర్ల - సూర్య వాస్తవం, నవంబర్ 15:** జిల్లా కలెక్టర్ హిమాన్స్ శుక్ల ఆదేశాలతో ఎట్టకేలకు గాంధీతాతకు మోక్షం చేకూరింది. మండల కేంద్రమైన చేజర్లలో ఈ శనివారం ఉదంతం చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన పూర్వపరాలిలా ఉన్నాయి. గత నెల అయిదవ తేదీ న మండల కేంద్రం చేజర్ల బస్టాండ్ లో ఉన్న గాంధీ మహాత్ముని విగ్రహాన్ని కొందరు తొలగించారు. ఈ నేపథ్యంలో ఆ విగ్రహ దాత దేవతి సుబ్బారావు ఆ సంఘటన ను నిరసిస్తూ న్యాయం జరిగే వరకు పోరాటం చేశారు. మండల స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు పలువురు అధికారులకు, ప్రజాప్రతినిధులకు నివేదించారు. ఎట్టకేలకు జిల్లా కలెక్టర్ చొరవతో సమస్య సానుకూలమైంది. తొలగించిన గాంధీ మహాత్ముని విగ్రహాన్ని జిల్లా కలెక్టర్ ఆదేశాలతో యధాతధ స్థానంలో ఏర్పాటు చేయడంలో ఆ విగ్రహ దాత సఫలీకృతులైనారు. విగ్రహాన్ని పునరుద్ధించుకున్న అనంతరం శనివారం గాంధీ మహాత్మునికి పాలాభిషేకం నిర్వహించి పూలమాల లు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అంతకుముందు విగ్రహ దాత దేవతి సుబ్బారావును తెలుగుదేశం పార్టీ మండల నాయకులు



ఆర్యవైశ్య సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ రావి పెంచల రెడ్డి మండల టిడిపి అధ్యక్షుడు షేక్ సిరాజుద్దీన్, సొసైటీ అధ్యక్షుడు బూదల్ల వీర రాఘవరెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకుడు రావి లక్ష్మీ నర్సారెడ్డి,బిజెపి నాయకులు జిల్లా ఉపాధ్యక్షులు బత్తల కృష్ణయ్య, ఆర్య వైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మదనపల్లి కిడ్నీ రాకెట్ కేసులో నిందితులు అరెస్ట్

## - మరో 9 మందిని త్వరలోనే అరెస్టు చేస్తాం : డిఎస్పీ



**మదనపల్లె - సూర్య వాస్తవం, నవంబర్ 15:** రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన మదనపల్లె గ్లోబల్ ఆసుపత్రి కేంద్రంగా కిడ్నీ రాకెట్ కేసులో ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల అరెస్టుకు సంబంధించి మదనపల్లి డి.ఎస్.పి మహేంద్ర మీడియాకు శనివారం సాయంత్రం మీడియాకు తెలిపిన వివరాల మేరకు... అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి పట్టణం, ఎస్బిఐ కాలనీ లోని గ్లోబల్ ఆసుపత్రి యజమాని, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ ఆంజనేయులు, ఆధ్వర్యంలో 15 మందితో కూడిన బృందం కిడ్ని రాకెట్ లో ఉన్నట్లు నిర్ధారించినట్లు తెలిపారు. ఈ కేసుల్ వారిలో ఆరుగురు నిందితులను సాయంత్రం అరెస్టు చేశామన్నారు. రాష్ట్రంలోని విశాఖపట్నం, ఆనందపురం మండలం, బొడ్డపాల్యానికి చెందిన సాడి కృష్ణ భార్య యమున(29), ని ఈనెల తొమ్మిదిన పథకం ప్రకారం కిడ్నీ రాకెట్ లోని ముఠా సభ్యులు మదనపల్లి గ్లోబల్ ఆసుపత్రికి తీసుకురావడం జరిగింది అన్నారు. అదే రోజే పతకం ప్రకారం డాక్టర్ల బృందం సిబ్బంది తో కలిసి, యమునా తో పాటు మరొకరికి కిడ్నీ లను తొలగించి అమర్చడం జరిగిందని చెప్పారు.

ఒకరికి సక్సెస్ కాగా యమునా, ఆపరేషన్ వికటించి మృతి చెందడం జరిగిందని దర్యాప్తులో తేలినట్లు డిఎస్పి మహేంద్ర పేర్కొన్నారు. ఈ కేసులో డాక్టర్ ఆంజనేయులును అరెస్టు చేస్తూ.. ఏ 2 ముద్దాయి బెంగళూరుకు చెందిన డాక్టర్ పార్థసారథి రెడ్డి చిక్కకపోవడంతో త్వరలో పట్టుకుంటామని తెలిపారు. అలాగే మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలోని అపోలో డయాలసిస్ మేనేజర్ బాలరంగడు అలియాస్ బాలు, కదిరి డయాలసిస్ మేనేజర్ మెహరాజ్, కిడ్నీ రాకెట్ లో కీలక పాత్ర పోషించిన విశాఖకు చెందిన పెళ్లి పద్మ,, కాకర్ల సత్య, యమునా ప్రియుడు సూరిబాబు లను అరెస్టు చేశామని తెలిపారు. బెంగళూరు చెందిన కిడ్నీ రాకెట్ లో ప్రముఖ పాత్ర పోషించిన డాక్టర్ని అరెస్టు చేయాల్సి ఉందని చెప్పారు. ఈ కేసులో మరో ఎనిమిది మంది నిందితులు ప్రముఖులు ఉన్నారని, వారిని కూడా త్వరలోనే పక్క ఆధారాలతో అరెస్టు చేస్తామని డిఎస్పీ పేర్కొన్నారు. మీడియా సమావేశంలో రెండవ పట్టణ సీఐ రాజారెడ్డి, వన్ టౌన్ సిఐ మహమ్మద్ రఫీ, ఇంటెలిజెన్స్ సీఐ, ఎస్సైలు పాల్గొన్నారు..

## లేడీ డాన్ అరుణకు

# ఈ నెల 28 వరకు రిమాండ్ పొడిగింపు

## - ఉద్యోగాలు ఇప్పిస్తానని 24.50 లక్షలు తీసుకుని మోసం చేసిన కేసులోఅరుణకు ముగిసిన 2 రోజుల పోలీసు కస్టడీ

**నెల్లూరు - సూర్య వాస్తవం, నవంబర్ 15:** ఫిర్యాదుదారు రమేష్ ఎవరో తనకు తెలియదనీ, ఉద్యోగాల పేరుతో డబ్బులు తీసుకోలేదని పోలీసు కస్టడీలో నెల్లూరుకు చెందిన కిలేడీ నిడిగుంట అరుణ చెప్పింది. తాను గతంలో వైకాపా పనిచేసిన కారణంగానే అక్రమ కేసులు పెట్టి బయటకు రాకుండా చేస్తున్నారని సమాధానమిచ్చినట్లు తెలిసింది. ఎస్.ఐ, అంగన్వాడీ ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు తీసుకుని మోసం చేసిన కేసులో అరుణను విజయవాడలోని ఎస్ఆర్ పేట పోలీసులు రెండు రోజుల కస్టడీకి తీసుకుని విచారించారు. శుక్రవారం పూర్తి స్థాయిలో విచారణ సాగింది. ఉద్యోగాలు ఇప్పిస్తానని వృద్ధుడిని రూ.24.50 లక్షలకు మోసం చేసిందని అరుణతోపాటు మరికొందరిపై ఇటీవల ఎస్ఆర్పేట స్టేషన్లో కేసు నమోదైన సంగతి తెలిసిందే. నిందితురాలిని సీసీఎస్ స్టేషన్లో ఉంచి విచారించారు. న్యాయవాదుల సమక్షంలో కేసు గురించి ప్రశ్నలు సంధించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యపరీక్షలు చేయించారు. తర్వాత న్యాయాధికారి ఎదుట హాజరుపర్చారు. త్వరగా బయటకు తీసుకురండి, శ్రీకాంత్ ను పెళ్లి చేసుకోవాలి, శ్రీకాంత్ను నేను



ప్రేమించా, పెరోల్ పై తెచ్చి పెళ్లి చేసుకుందామనుకున్నా. నిశ్చితార్థం కూడా అయింది. ఈ దశలో నన్ను అనవసరంగా కేసుల్లో ఇరికించి బయటకు రాకుండా కుట్రపన్నారు. నాపై నెల్లూరు జిల్లాలో పలు కేసులు నమోదు చేశారు.' విచారణ సందర్భంగా నిడిగుంట అరుణ పోలీసులతో చెప్పినట్లు తెలిసింది. తాను గతంలో వైకాపాలో తిరిగాననీ, అందుకే కక్షతో కేసుల్లో ఇరికిస్తున్నారని అన్నట్లు సమాచారం. త్వరగా బెయిల్పై బయటకు తీసుకురావాలనీ.. శ్రీకాంత్ తో పెళ్లి చేసుకోవాలని.. తన లాయర్లతో ఆమె పదే పదే అన్నట్లు సమాచారం.28 వరకు రిమాండ్ పొడిగింపు, ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పోలీసులు ఆమెను విచారించారు. అనంతరం ఆమెను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆక్కడ వైద్యపరీక్షలు చేయించారు. ఆసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం ఆమెను ఆసుపత్రి వెనుక గేటు నుంచి తరలించారు. న్యాయస్థానం వద్ద కూడా ఇదే హైడ్రామా నడిచింది. సాయంత్రం 1వ అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. విచారణ తర్వాత నిడిగుంట అరుణకు ఈనెల 28 వరకు రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి దేవిక ఆదేశాలిచ్చారు. అనంతరం ఆమెను రైలులో నెల్లూరుకు తరలించారు.

## ఆంజనేయ స్వామి గ్రామోత్సవం



**పామిడి - సూర్య వాస్తవం, నవంబర్ 15:** పామిడి పట్టణములో స్థానిక పెన్నా నది ఒడ్డున ఉన్నటువంటి సాయిబాబా గుడి వద్ద ఆంజనేయుల స్వామి మాలదారులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం మరియు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా భక్తాదులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. అంతేకాకుండా దాదాపుగా 1000 మంది భక్తాదులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తిని పామిడి పెన్నా నది ఒడ్డున ఉన్నటువంటి సాయిబాబా దేవాలయం నుండి శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం వరకు ఊరేగింపుగా గ్రామోత్సవాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హనుమాన్ దీక్ష దారులు, అశేష భక్తాదులు పెద్ద ఎత్తున పాల్గొని గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది.



## శ్రీవారిని దర్శించుకున్న వరల్డ్ కప్ విన్నర్ శ్రీచరణి

### - క్రికెటర్ శ్రీచరణిని అభినందించిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు



**తిరుమల - సూర్య వాస్తవం, నవంబర్ 15:** ఇటీవల మహిళల ప్రపంచ కప్‌లో భారతదేశానికి విజయాన్ని చేకూర్చిన క్రికెటర్ శ్రీచరణి శ్రీవారి దర్శనం కోసం తిరుమల కు విచ్చేశారు. దర్శనానంతరం ఆమె క్యాంప్ కార్యాలయంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టిటిడి చైర్మన్ శ్రీచరణిని శాలువాతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. శ్రీవారి ఆశీస్సులతో క్రికెట్ క్రీడలో ఉన్నత శిఖరాలు అదిరోహించాలని శ్రీచరణిని ఆశీర్వదించారు. టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి కూడా శ్రీచరణి ని శాలువాతో సత్కరించి అభినందించారు.

## టీటీడీ చైర్మన్ ను కలసిన కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్



**తిరుపతి - సూర్య వాస్తవం, నవంబర్ 15:** తితిదే చైర్మన్ బీ ఆర్ నాయుడు ను రాష్ట్ర కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తోట వాసుదేవ్ రాయల్ శనివారం తిరుమలలోని చైర్మన్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టిటిడి చైర్మన్ ను కాపు కార్పొరేషన్ డైరెక్టర్ తోట వాసు దేవ్ రాయల్ శాలువ తో ఘనంగా సత్కరించారు. తోట వాసుదేవ్ రాయల్ డైరెక్టర్ గా పదిమందికి ఉపయోగపడేలా మంచి పనులు చేయాలని సూచించారు. అలాగే భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని చైర్మన్ బిఆర్ నాయుడు ఆకాంక్షించారు. వాసుదేవ్ రాయల్ తో పాటు శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు టీటీడీ చైర్మన్ ను కలిసిన వారిలో ఉన్నారు.

Truth of News
RNI NO : APTEL/25/A0239
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్



# సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యం

## - ఆరోగ్య ఇబ్బందుల్లో ఉన్నవారికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి భారీ సహాయం







**సూళ్లూరుపేట - సూర్య వాస్తవం, నవంబర్ 15:** ఆర్థికంగా బలహీనస్థితిలో ఉన్న ప్రజలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సీఎంఆర్ఎఫ్ ద్వారా అండగా నిలుస్తున్నారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలిపారు. శుక్రవారం సూళ్లూరుపేట సత్యసాయి కళ్యాణమండపంలో కలిసి 84 మంది లబ్ధిదారులకు రూ.79,31,605 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటివరకు 230 మంది ప్రజలకు మొత్తంగా రూ.2,88,32,581 విలువైన చెక్కులు అందజేశామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తూనే పేదల ఆరోగ్య సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. పేదలు చికిత్స ఖర్చుల భారంతో ఇబ్బందులు పడకుండా వైద్య సహాయాన్ని సీఎంఆర్ఎఫ్ ద్వారా అందిస్తున్నామని వివరించారు.

అభివృద్ధి - సంక్షేమం పట్ల ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, తాగునీటి పథకాల కోసం కోట్లాది రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. కూటమి పార్టీ నాయకులు, అధికారుల సహకారంతో నియోజకవర్గ అభివృద్ధిని వేగవంతం చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట ఏఎంసీ చైర్మన్, జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జి ఉయ్యాల ప్రవీణ్, నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన శ్రీధర్, టిడిపి నాయకులు సన్నారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, సంచి కృష్ణయ్య, విజయ్ కుమార్ నాయుడు, పొట్లపూడి రాజేష్, కందల కృష్ణారెడ్డి, పేరం మధు నాయుడు, కాపులూరు చక్రపాణి, వేలూరు చంద్రయ్య, పరసా రాజా పాల్గొన్నారు.







# ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయ నిధి అందజేత

## - ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



పెళ్లకూరు - సూర్య వాస్తవం నవంబర్ 15: సూళ్లూరుపేట ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం జరిగిన ముఖ్యమంత్రి సహాయ నిధి పంపిణీ కార్యక్రమంలో, ఆపదలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేలా చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథులుగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పాల్గొని లబ్ధిదారులకు నిధులను అందించారు. ఈ కార్యక్రమంలో పెళ్లకూరు మండల అధ్యక్షులు సంచి కృష్ణయ్య, టిడిపి సీనియర్ నాయకులు పేరం రమేష్ నాయుడు పాల్గొన్నారు.

**లబ్ధిదారులకు అందించిన ముఖ్యమంత్రి సహాయ నిధి వివరాలు ఇలా ఉన్నాయి:** పెళ్లకూరు ఎస్సీ సెల్ అధ్యక్షుడు కన్న వాసుకి రూ.1,00,000. నెలబల్లి పంచాయతీ పుల్లూరు గ్రామానికి చెందిన లోకేష్కు రూ.40,000. కన్నలి వెంకటరెడ్డికి రూ.1,05,000. అత్తివరం గ్రామానికి చెందిన రవికి రూ. 35,000. భీమవరం గ్రామానికి చెందిన కట్ల బాబుకి రూ.45,000. అక్కగారిపేటకు చెందిన లిసాగి మునిశివరామ నాయుడుకి రూ.60,000. ముమ్మారెడ్డి గుంటకు చెందిన మట్టిపాటి కామేశ్వరికి రూ.84,000. ఆపదలో ఉన్న కుటుంబాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందిస్తున్న ఆర్థిక సహాయం పేదల జీవితాల్లో ఆదరణ కల్పిస్తుందని ఎమ్మెల్యే విజయశ్రీ పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు.

